క్లుప్తంగా

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం:బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ద్వారా అందించే ఉపకార వేతనాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బ్రాహ్మణ సేవా ట్రస్ట్ చైర్మన్ దంతుర్తి సత్యప్రసాద్ గురువారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ తత్సమాన కోర్సులు చదువుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన మెరిట్ విద్యార్థులు స్కాలర్‌షిప్ పొందడానికి అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీ లోగా అర్హత ఉన్న వారు 9849592523 నంబరుకు నేరుగా సంప్రతించవచ్చునన్నారు.

పొరుగూరు వెళ్లి పింఛను అందజేత


గంగమ్మకు పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ దుర్గాప్రసాద్

రాయవరం: మనవడికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో పెన్షన్ తీసుకోవడానికి వృద్ధురాలు ఇంటివద్ద అందుబాటులో లేదు. దీంతో మాచవరం వలంటీర్ చెల్లే దుర్గాప్రసాద్ కాకినాడ జిల్లా కరప మండలం సిరిపురం వెళ్లి అవ్వకు పింఛను సొమ్మును అందజేశాడు. వలంటీర్ ఆమె ఇల్లు వెదుక్కుని పింఛను అందించగానే ఆమె ఆనందానికి అవధుల్లేవు. పింఛన్ అందుకున్న బామ్మ పచ్చిమళ్ల గంగమ్మ వలంటీర్ దుర్గాప్రసాద్‌ను చుట్టుపక్కల వారికి చూపించి మా వలంటీర్ నన్ను వెతుక్కుంటూ వచ్చి పింఛన్ ఇచ్చాడంటూ అందరికీ పరిచయం చేసింది.

వలంటీర్ ఔదార్యం


జీజీహెచ్‌లో దుర్గాభవానికి పింఛను అందిస్తున్న వలంటీర్ తరంగిణి

రామచంద్రపురం రూరల్: వలంటీర్ వ్యవస్థ రాష్ట్రానికే తలమానికంగా మారింది. వారి సేవలు అందరికీ చేరువయ్యాయి. రామచంద్రపురం మండలం ద్రాక్షారామకు చెందిన చిట్టూరి దుర్గాభవాని దివ్యాంగురాలు. ఆమెకు ప్రభుత్వం ప్రతి నెలా రూ. 3 వేలు పింఛను అందిస్తోంది. అయితే ఆమెకు రెండు కిడ్నీలు పాడై 20 రోజులుగా కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. వలంటీర్ పెచ్చెట్టి తరంగిణి తన తండ్రి పెచ్చెట్టి శంకరరావు సహకారంతో గురువారం కాకినాడ వెళ్లి దుర్గాభవానికి పింఛను సొమ్ము అందించింది. ఆమెను పలువురు అభినందించారు.

రెండు గ్రామాల్లో పొలంబడి

కపిలేశ్వరపురం: అవగాహన లేకుండా చేసే వ్యవసాయం అనర్థాలకు దారి తీస్తుందని మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. టేకి, వెదురుమూడి గ్రామాల్లో గురువారం ఖరీఫ్ -2023 సీజన్ తీరుపై రైతులకు ఆయన పొలంబడి అవగాహన తరగతి నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సాగు పద్ధతులపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఆచరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై పరిష్కార మార్గాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు జి. హరిబాబు, రఘు, ప్రియాంక, పొలంబడి గ్రూప్ లీడర్లు కొత్తపల్లి కృపారావు, దామిన బుల్లిరాజు, కామిరెడ్డి రాముడు, కొండిపర్తి పట్టాభి రామయ్య, దాసర వీరేంద్ర చౌదరి, చేకూరి విష్ణు మూర్తి పాల్గొన్నారు

నేడు సచివాలయ భవనం ప్రారంభం

కాజులూరు: శీల గ్రామంలో శుక్రవారం మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పర్యటించనున్నారని సర్పంచ్ కోమలి వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మంత్రి వేణు శీల గ్రామంలో పర్యటించి రూ.50 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలన్నారు.

లంక గ్రామాల్లో పారిశుధ్య పనులు


అద్దంకివారిలంకలో ముగ్గు చల్లుతున్న పనిని పర్యవేక్షిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

కపిలేశ్వరపురం: మండలంలోని లంక గ్రామాలను వరద ముంపు వీడిన నేపథ్యంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య చర్యలను చేపట్టారు. అద్దంకివారిలంక, పల్లపులంక, వీధివారిలంక, కేదారిలంక, నారాయణలంక గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు శ్రమించి పూడిక తరలించి ముగ్గు చల్లారు. పనులను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, ఆయా పంచాయతీల సర్పంచులు వీధి వెంకటరెడ్డి, నాతి గవరయ్య, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ఇంటింటా సంక్షేమ సం'క్రాంతి'

- ముగిసిన 'జగనన్న సురక్ష'
- 1.59 లక్షల ఇళ్లను సర్వే చేసిన వలంటీర్లు
- 2.12 లక్షల మందికి సేవా సర్టిఫికెట్ల పంపిణీ


జగనన్న సురక్షలో లబ్ధిదారుకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు (ఫైల్)

రాయవరం: ఏ సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. రూపాయి ఖర్చు లేకుండా సేవా సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేశారు. గ్రామ/వార్డు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితో నెల రోజులుగా సాగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. క్లస్టర్ పరిధిలో ఐదు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైంది. జూన్ 24న ప్రారంభమైన సురక్ష కార్యక్రమం జూలై 31న పూర్తయ్యింది. అధికారులు, వలంటీర్లు 1.59 లక్షల ఇళ్లను సర్వే చేశారు.

11 రకాల సర్టిఫికెట్లు

'జగనన్న సురక్ష'లో కుల, ఆదాయ, జనన, మరణ, మ్యుటేషన్స్, వివాహ, ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కు మొబైల్ లింక్, కౌలు రైతులకు సీసీఆర్‌సీ సర్టిఫికెట్లు, కొత్త బియ్యం కార్డు, హౌస్ హోల్డ్ విభజన వంటి 11 రకాల సేవా సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల్లో 132 సచివాలయాలు ఉన్నాయి. వాటి పరిధిలో 2,658 క్లస్టర్లలో సర్వే కోసం వలంటీర్లు 1,39,340 కుటుంబాలను సందర్శించారు. 2,12,662 మందికి 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు అధికారులు మంజూరు చేసి, ఆయా సచివాలయాల పరిధిలో ప్రజాప్రతినిధులు సమక్షంలో లబ్ధిదారులకు అందజేశారు.

ఒక వైపు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటా సర్వే కొనసాగించగా, మరోవైపు రోజూ ఓ సచివాలయం పరిధిలో సురక్ష క్యాంపులు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ప్రభుత్వ సేవలకు నిదర్శనం



గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం తీర్చిదిద్దింది. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశాం. అడ్మిషన్ల సమయం కావడంతో ముఖ్యంగా విద్యార్థులకు ఎంతగానో ఉపకరించిది. లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి, వివరాలు తీసుకుని సర్టిఫికెట్లు అందజేయడం ప్రభుత్వ సేవలకు నిదర్శనం.

– కె.నరేంద్రరెడ్డి, ఎంపీడీవో, రాయవరం

ప్రజల సంతృప్తి స్థాయి పెరిగింది



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి, లబ్ధిదారులకు కావాల్సిన అన్ని రకాల సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా తయారు చేసి, వారికి అందజేశాం. జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల సంతృప్తిస్థాయి పెరిగింది.

– ఎ.శాంతి, డీఎల్‌డీవో, రామచంద్రపురం

చారిత్రాత్మకం 'జగనన్న సురక్ష'

మంత్రి వేణుగోపాలకృష్ణ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం: ప్రజావసరాలను గుర్తించడంతో పాటు వారికి కావాల్సిన పౌర సేవలు ఇంటి వద్దే అందించడమే లక్ష్యంగా గత 30 రోజులుగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం అయ్యిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించే సీఎం జగన్ పౌర సేవలు అందించడంలో సరికొత్త ఒరవడిని తీసుకొచ్చారని మంత్రి వేణు అన్నారు. సచివాలయాల్లో పరిధుల్లో పౌరులకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను వలంటీర్ల ద్వారా కేవలం రెండు రోజుల్లోనే అందించడం ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకంగా నిలిచిందని అభివర్ణించారు. గతంలో సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడేవారన్నారు. అలాంటి సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో తీసుకువచ్చిన మార్పులతో నేడు ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జిల్లాల విభజనతో పాటు రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం, 50 ఇళ్లకు ఒక వలంటీర్ ద్వారా పరిపాలన ప్రజలకు చేరువైందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రామచంద్రపురం మున్సిపాలిటీలో 14,438, రామచంద్రపురం మండలంలో 16,785, కె.గంగవరం మండలంలో 52,618, కాజులూరు మండలంలో 15,062 ధ్రువపత్రాలను అందించారన్నారు. నియోజకవర్గంలో మొత్తంలో 66,614 కుటుంబాలుంటే 98,903 ధ్రువపత్రాలను 78 జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా అందించామని మంత్రి వివరించారు. జిల్లా స్థాయిలో కె.గంగవరానికి రెండో స్థానం రావటం పట్ల కె.గంగవరం ఎంపీడీవో, తహసీల్దార్, ఇతర శాఖల అధికారులను మంత్రి అభినందించారు.

ప్రజల హృదయ విజేత 'జగనన్న సురక్ష '


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ప్రజల హృదయాలను గెలుచుకుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం కావడంతో లొల్ల గ్రామంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజలకు 11 రకాల సేవలను అందించేందుకు ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష పథకం ప్రజల ఆదరణను విశేషంగా పొందిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఎవరికి ఏయే సర్టిఫికెట్ కావాలో తెలుసుకునే సర్వే చేశారన్నారు. ఆ వివరాలను అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారన్నారు. అధికారులు అర్హత గల ప్రతి సర్టిఫికెట్‌ను లబ్ధిదారులకు అందజేశారన్నారు. రాష్ట్రంలో జగనన్న సురక్ష పథకం ద్వారా కోటీ 46 లక్షల కుటుంబాలకు మేలు కలిగిందన్నారు.జగనన్న సురక్ష శిబిరాల్లో 93,50,000కు పైగా సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. మండపేట నియోజకవర్గంలో 1.30 లక్షల మంది సమస్యలు పరిష్కరించి, అవసరమైన సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారన్నారు. మండపేట మండలంలో 46,900, కపిలేశ్వరపురం మండలంలో 43 వేలు, రాయవరం మండలంలో 22,800, మండపేట పట్టణంలో 19,600 సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. విలేకరుల సమావేశంలో లొల్ల గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

గంగాధర్ నియామకంపై హర్షం

మండపేట: మండపేట సొసైటీ చైర్మన్‌గా పట్టణ శెట్టిబలిజ సంఘం మాజీ అధ్యక్షుడు పెంకే గంగాధర్ నియామకంపై ఆ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంఘ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో సంఘ నాయకులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును స్థానిక క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పార్టీలో కష్టించి పనిచేసే వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని గంగాధర్‌ను అభినందించారు. అలాగే వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబును గంగాధర్ మర్యాద పూర్వకంగా కలిశారు. సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజులు, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, బీసీ సంఘం నియోజకవర్గ కన్వీనర్ బెల్లపుకొండ దొరబాబు, సంఘ నాయకులు యాంద్ర బుజ్జి, గుత్తుల గోవిందు, చొల్లంగి గోవిందు, గెద్దాడ సత్యనారాయణ, గుత్తుల బాబి, నామాల సత్యనారాయణ, దొంగ వీరబాబు, కడియాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

మండపేట: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని ఉద్యాన శాఖ అధికారి ఎం. అనూష అన్నారు. మండలంలోని జెడ్. మేడపాడులో గురువారం ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, అంతర పంటల సాగు గురించి అనూష రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ఆయిల్‌పామ్ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు, పతంజలి ఏజీఎం పట్టాభి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులపై విచారణ జరిపించాలి

మండపేట: మండలంలోని ఏడిద– దుళ్ల రోడ్డులో అత్యవసర నిధులు రూ. 50 లక్షల వ్యయంతో చేసిన మరమ్మతులపై కలెక్టర్ విచారణ జరిపించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. గురువారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి ఈ రోడ్డులో చేసిన మరమ్మతులను పరిశీలించారు. పూర్తిగా పనులు చేయకుండానే నిధులు అయిపోయాయని ఆర్‌అండ్ బీ అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతుండడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

సొసైటీల పాలకవర్గాల ప్రమాణ స్వీకారం


చైర్మన్ శ్రీరంగారావును సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


కోటేశ్వరరావును సత్కరిస్తున్న పిడుగు రాముడు తదితరులు


కోరుమిల్లి సహకార సంఘం చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న స్వామి

మండపేట: రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రైతులు అండగా నిలవాలని నేతలు పిలుపునిచ్చారు. మండలంలోని ద్వారపూడిలోని జెడ్ మేడపాడు సొసైటీ నూతన త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం సొసైటీలో ఘనంగా జరిగింది. చైర్మన్‌గా తులా శ్రీరంగారావు, పర్సన్‌లుగా దండుబోయిన సూర్యనారాయణమూర్తి, ముత్తాబత్తుల రాముడు ప్రమాణ స్వీకారం చేశారు. ఉప సర్పంచ్ తులా శేషారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గజ్జి వెంకటరమణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తదితరులు హాజరయ్యారు. గ్రామంలో పుంత రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు శేషారావు చెప్పారు. చైర్మన్ శ్రీరంగారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో జెడ్.మేడపాడు సొసైటీని మొదటి స్థానంలో నిలిపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నూతన చైర్మన్ శ్రీరంగారావు, మాజీ చైర్మన్ శ్రీరామవర్మను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సేవాదళ మండల కన్వీనర్ పోతుల రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్ నాయుడు, పార్టీ నాయకులు సంగిశెట్టి రమేష్, తోరం శ్రీనివాస్, సత్తి సత్తిబాబు, నామాల పెదవెంకన్న, పోలినాటి సత్యనారాయణ, లక్ష్మీవీరభద్రరావు, సత్తి రాంబాబు, గూడూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

వెలగతోడులో..

మండపేట: ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు సొసైటీ పాలకవర్గాలు కృషి చేయాలని ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సాదే పిడుగురాముడు అన్నారు.వెలగతోడు సొసైటీ చైర్మన్‌గా ముక్కపాటి కోటేశ్వరరావు, పర్సన్‌లుగా చిటికెన వీర్రాజు, పిల్లిల్లి చిన అప్పారావుల ప్రమాణ స్వీకారం గురువారం సొసైటీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ కోటేశ్వరరావు, పర్సన్‌లకు పిడుగురాముడు, పాలతోడు సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, అరవరాజు దంపతులు అభినందనలు తెలి పారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ సుభానీ, వైఎస్సార్ సీపీ నాయకులు తుమ్మా వీరబాబు, ముక్కపాటి రాజు, అన్నందేవుల నాగేశ్వరరావు, దోమల రాజేష్, పిడిపే చిన్నబాబు, సాదే సుమన్, పాలిమాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోరుమిల్లి సొసైటీ అధ్యక్షుడిగా స్వామి

కపిలేశ్వరపురం: కోరుమిల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఆచంట వీరవెంకట స్వామి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా కొత్తపల్లి సూర్యారావు, చిటికన వెర్రియ్యలతో సొసైటీ సీనియర్ ఉద్యోగి మట్టా కృష్ణ ప్రమాణం చేయించారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గానికి సర్పంచ్ ఆచంట సత్య నారాయణ, ఎంపీటీసీ సుంకర వెంకటేశ్వరరావు, సచివాలయం కన్వీనర్ పేరాబత్తుల రామకృష్ణ అభినందనలు తెలిపారు.

జగనన్న పాలనలో పల్లెల ప్రగతి


గొల్లపాలెం ఎస్సీపేటలో సీసీ డ్రెయిన్‌కు శంకుస్థాపన చేసిన నాయకులు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పల్లెలు ప్రగతి బాట పట్టాయని వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. గొల్లపాలెం శివారు ఎస్సీ పేటలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, ఆదిమూలల కాలనీలో రూ.10 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి గురువారం ఏసురాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు తదితరులు భూమిపూజ చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు చేసుకున్న వినపాల మేరకు మంత్రి వేణుగోపాలకృష్ణ ఈ నిధులు మంజూరు చేశారన్నారు. పనులు పూర్తయితే గ్రామంలో రోడ్డు, పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు జొన్నకూటి పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, ఆర్ఎంసీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు, నాయకులు తోట కృష్ణ, మాత నాగరాజు, నాగేశ్వరరావు, పెంటపాటి శ్రీను, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టండి

- మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ
- ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం


మంత్రి వేణు సమక్షంలో వ్యవసాయ శాఖ ప్రగతిని వివరిస్తున్న ఏఓ రవి

కె.గంగవరం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షత వహించగా మంత్రి వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వివిధ శాఖల వారీగా నివేదికను మండల స్థాయి అధికారులు సభకు వినిపించారు. ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. కుందూరు, కోట సర్పంచులు పిల్లి సత్యానందం, వెంకట్రావు తమ గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాలు వేయాలన్నారు. ఏఈ మాట్లాడుతూ వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి వేణుగోపాలకృష్ణ ఆదేశించారు. వారం రోజుల పాటు రోజుకు రెండు గ్రామాల చొప్పున వైద్య, పంచాయతీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు బృందంగా ఏర్పడి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు దోమల నివారణకు మందును పిచికారీ చేయాలని సూచించారు. వరద ఉధృతి కారణంగా జీవనోపాధి కోల్పోయిన రెండు వేల మత్స్యకార కుటుంబాలకు బియ్యంతో పాటు నిత్యావసరాలు, రూ.2 వేల సాయం అందించామన్నారు. కూళ్ల, సుందరపల్లి, కోట, కోటిపల్లి, దంగేరు, మసకపల్లి, బ్రహ్మపురి, శేరిలంక గ్రామాల్లో పశువులకు ఉచితంగా దాణా పంపిణీ చేశామని చెప్పారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు దూడల నాగేశ్వరరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం


మసకపల్లిలో మత్స్యకార కుటుంబాలకు సరకులు అందిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: వరద బాధితులకు ప్రభుత్వం కొండంత అండగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కూళ్ల, బ్రహ్మపురి, మసకపల్లి, కోట గ్రామాల్లో వరద బాధితులకు ప్రభుత్వం సమకూర్చిన నిత్యావసర సరకులను మంత్రి వేణు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడానికి కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, 25 కిలోల బియ్యం, నూనె, బంగాళాదుంపలు అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ పంప నాగమణి, డీటీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్‌లు పిల్లి అన్నపూర్ణకళ్యాణ్, వెంట్రావు, చిల్లే నాగేశ్వరరావు, కన్వీనర్లు కాదా గోవిందు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రామచంద్రపురం రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. వెలంపాలెంలో సర్పంచ్, ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ తదితరులతో కలసి మంత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరిస్తూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాసంశెట్టి లావణ్య, నాయకులు చల్లా శ్రీను, పువ్వల నాగభూషణం, పలివెల రాజేష్ పాల్గొన్నారు.

ఇంటింటి సంక్షేమం.. జగనన్నకే సాధ్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- లొల్లలో గడప గడపకూ..


లొల్లలో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రాయవరం: ఇంటింటికీ సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. లొల్ల గ్రామంలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చేవా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ తదితరులతో ఎమ్మెల్సీ త్రిమూర్తులు గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సాధికారితే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలు పొందుతున్న లబ్ధితో ఉన్న కరపత్రాలను ఆయన ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు వెలంపాలెపు వెంకన్న, పడాల వసంతకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, సొసైటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, పార్టీ సేవాదళ్ మండల కన్వీనర్ వెలగల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు, మండలంలోని వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రుల అభివృద్ధి కమిటీ సమావేశాలు


ద్రాక్షారామలో మాట్లాడుతున్న ఎంపీపీ భవాని

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీల్లోని ఆసుపత్రి అభివృద్ధి కమిటీల సమావేశాలు చైర్మన్, ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించారు. ఆసుపత్రుల అభివృద్ధికి నిధుల ఖర్చు, అవసరమైన పరికరాలు తదితర అంశాలను ఆమోదించారు. ఎంపీపీ భవాని మాట్లాడుతూ పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రోగులకు చిత్తశుద్ధితో సేవలందించాలని వైద్యులు, సిబ్బందిని కోరారు. ఆయా సర్పంచులు కొత్తపల్లి అరుణ, వీరబోయిన సూరిబాబు, వైద్యాధికారులు ఎస్. ప్రశాంతి, సందీప్, మమత, ఆదినారాయణ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కపిలేశ్వరపురం: విపత్తుల సమయంలో లంక గ్రామాల ప్రజలను ఆదుకున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వరదలకు ప్రభావితమైన ఐదు లంక గ్రామాల ప్రజలకు గురువారం ఐదు రకాల నిత్యావసర సరుకులను ఎమ్మెల్సీ తోట, ఆర్డీఓ సింధూ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందజేశారు. కేదారిలంక, వీధివారిలంక గ్రామాల్లో 1100 కుటుంబాలకు, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లో 837, నారాయణలంకలో 284 మొత్తం 2,221 కుటుంబాలకు సరుకులను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు కేజీ చొప్పున ఐదు రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, సర్పంచ్ నాతి గవరయ్య, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, వైఎస్సార్ సీపీ గ్రామాల అధ్యక్షులు కొండేటి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి గణేష్, మండల పరిషత్ చీఫ్ విప్ పలివెల మధులతో కలిసి ఎమ్మెల్సీ తోట సరుకులను అందజేశారు. లంక గ్రామాల ప్రజలకు సమీప కపిలేశ్వరపురం, అంగర, తాతపూడి, వడ్లమూరు తదితర గ్రామాల వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అండగా నిలిచారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పలు శాఖల అధికారురు రాత్రి తెల్లవార్లూ కూరగాయలను ప్యాకింగ్ చేస్తూ సామాజిక సేవలో పాల్గొన్నారు.